

# జాలిలేని జాబిలి

## – కొమ్మూరి వేణుగోపాలరావు



తనకు కావలసింది వెదుక్కుంటూ ముందుకుపోవడమే మానవుని జీవితం. కాని తనకు కావలసిందేమిటోకూడా తెలియని అస్పష్టస్థితి.

రచయిత కావాలనుకున్నాడు - అయినాడు. డాక్టరు కావాలనుకున్నాడు - అయినాడు. పేరు ప్రఖ్యాతులు కావాలనుకున్నాడు - లభించినై.

కానీ అతనికి యేదో కావాలి. అతన్నెంతోమంది ఆరాధించారు. జీవితంలోకి ఎందరో సుందరీమణులు ప్రవేశించారు. అతని చుట్టూ ప్రేమ హృదయంలో ప్రేమ. కాని ఆ ప్రేమ అతన్ని స్పర్శించేదేగాని అదృష్టవంతుణ్ని చేయలేదు.

యవనం వుంది - డబ్బు వుంది - కీర్తి వుంది - అంతా వున్నారు కాని...?

అతనిపట్ల జాబిలికి జాలిలేదు.

*కొమ్మూరి రవికిరణ్ గారి ప్రత్యేక అనుమతితో*
*అలనాటి అందమైన నవల పునర్ముద్రణ*

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

**ఎక్కడకు పోతుంది పద్మజ** తనకుగాకుండా? కాని సూటిగా "మనం పెళ్ళి చేసుకుందామా?" అని అడగటానికి అతని మనస్సు ఒప్పలేదు. ఉత్తరాలు రాయటం ఆపేసి, కొన్ని నెలలయాక హఠాత్తుగా వెళ్ళి ఆమెను కలుసుకుని, ఆనందంతో ఉక్కిరి బిక్కిరి చేసి, తమ వివాహ ప్రశంస తమాషాగా, కథలోని దృశ్యంలా జరగాలి. అందులో ఓ ప్రత్యేకత వుండాలి సొగసుండాలి.

"నేను మీకు ఇహ ఉత్తరాలు రాయను. వాటివలన మీకు చాలా కష్టం, అశాంతి కలుగచేస్తున్నట్లు నా నమ్మకం. మీ జీవితం నుంచి తొలిగిపోదలచాను. ఎప్పటికయినా మీకేదయినా జరిగితే నాకు తప్పకుండా శుభలేఖ పంపిస్తారు కదూ."

తమ బంధం చిత్రమైనది. ఒకసారి నువ్వనుకుంటారు. ఒక్కొక్కసారి మీరనుకుంటారు.

పోస్ట్ చేసి నిట్టూర్పు విడిచాడు.

"మీ చివరి ఉత్తరం అందింది. ఐతే శాశ్వతంగా సెలవుపుచ్చుకోదలచారన్నమాట. ఈ ప్రపంచం మీద నాకు నమ్మకం నశిస్తోంది. ఎంత అల్పులు మనుష్యులు. ఇంత సులభంగా బంధాలు తొలగించుకోవటానికి ఎంత కఠినత్వం. ఇన్నాళ పరిచయం, స్నేహం అంతా ఒక్క క్షణములో సఫా. మరోమారు చెబుతున్నాను. మీ ఉత్తరాల వలన నాకు అశాంతీ ఇబ్బంది ఏమీలేవు. అదంతా మీ భ్రమ. సరే కథ ముగింపు వచ్చింది. కారణంలేని ముగింపు. నాకు యీ భూమ్మీద ఒక జత లోకానికి అర్థంకాని ఒక ఉజ్జీవున్నాడనుకున్నాను. అతను కూడా అందరితోపాటే అయిపోయినాడు. ఎప్పుడయినా సన్నజాజి పువ్వులు కనిపిస్తేనయినా నేను జ్ఞాపకం వస్తానా? మీకు గులాబీలు ఇష్టం కదూ! రోజూ నిద్రలేవగానే కిటికీలోంచి మా తోటలోని గులాబీ మొక్కకేసి చూడటం నా అలవాటు. దానికి రోజూ ఓ పువ్వు పూస్తోంది. అలాగే ఎంతోసేపు దాన్ని తిలకిస్తూ వుండిపోతున్నాను. ఎవర్నీ కోయనియ్యటంలేదు. మీరు నాకు రాసినా, రాయకపోయినా నా పుట్టినరోజుకు మీ ఆశీస్సులు అందాలి. ఇహ సెలవా? ఎట్లా సెలవు తీసుకోవటం? బైబై చెప్పటమా...? టాటా...అని చేతి రుమాలు ఊపటమా? లేక మన హిందూ పద్ధతిలో మోకాళ్ళమీద వొంగి సాష్టాంగ...ఏం?

అవునుగాని నా శుభలేక మీకు అందదు. ఎందుకంటే అది అచ్చయి అప్పుడే మూడేళ్ళయిపోయింది. అంటే నా పదిహేనేళ్ళ వయస్సులో అర్థమవుతోందా? నేను పెళ్ళయినదాన్ని."

మరి...అయితే....

ప్రపంచం పెళపెళమని విరిగి పడింది. వెయ్యికంఠాలు వెక్కిరించాయి. చీకటి నల్లగా నోరు తెరిచి నవ్వింది. భూమి బ్రద్దలైంది.

అతని గుండె పగిలిపోయింది.

ఆ రాత్రి గదిలో అటూ ఇటూ తిరుగుతున్నాడు. పిచ్చెక్కినట్లు. రెండోసారి తన జీవితం చిరిగిపోయింది నిర్దయంగా. ఎన్ని ఆశలు? ఎన్ని కలలు?

ఎటు చూస్తే అటు చీకటి.

"ఎంతపని చేశావు పద్మా! ఎంతపని చేశావు? ఇన్నాళ్ళూ యీ విషయం ఎందుకు నాకు చెప్పలేదు? ఇంత అన్యాయం ఎందుకు చేశావు? నీకు కావలిసింది వేరు. నాకు కావల్సింది వేరు. చెప్పు పద్మా ఇదంతా అబద్ధమనీ, వొట్టి తమాషాకని, అంతా గమ్మత్ అనీ చెప్పు. లేదు పద్మా నువ్వలా చెప్పవు. అంతా నిజం. నాకు తెలుసు. ఈ ఉత్తరంతో ఇంత విషం పంపించకపోయావూ? పద్మా! పద్మా! పద్మా! "

23

వేసవి సెలవులు యిచ్చారు. మధుబాబు ఇంటికి వచ్చాడు.అతని తల అంతా ప్రస్తుతం శూన్యంగా వుంది. అభిప్రాయాలూ లేవు, అభిరుచులూ లేవు. బయటకు కూడా కదలటం మానేశాడు. ఉమాపతి తరుచు వచ్చిపోతున్నాడు. అతనీమధ్య నవలొకటి రాశాడు పొదుపు అనేదాన్ని ప్రాథమిక ఉద్యమంగా తీసుకున్నాడు. మధ్య తరగతి వాళ్ళ బాధలకూ, కష్టాలకూ కారణం ఎక్కువ దుబారానే అనీ, అర్థంలేని వంశానుగత ఆడంబరాలేననీ విమర్శించుకుంటూ వచ్చాడు. పండగలూ, పెళ్ళిళ్ళూ, సమర్తలూ వీటిలో ఎంత డబ్బు వృధాగా, అవివేకంగా ఖర్చుపెడతారో సహేతుకంగా నిరూపించసాగాడు. సీరియల్‌గా వస్తోన్న అతని నవలకు మంచి ప్రచారం వచ్చింది. వంటింట్లోంచి బయటకు ఆని స్త్రీ శిరోమణులని కూడా ఆకర్షించసాగింది.

ఉమాపతి ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ కూడా బహుముఖంగా చదవలేదు. కాని తనకు అవసరమైనంత వరకూ క్షుణ్ణంగా చదువుతాడు. తెలియని సంగతి గురించి అసలు రాయడు. దాని జోలికి పోడు. స్వతహాగా కొన్ని అభిప్రాయాలు వున్నాయి. జీవితాన్ని చూసి కొన్ని ఏర్పరచుకున్నాడు నిశితంగా, చురుగ్గా ఆలోచించగలడు.

మధుబాబు ఏమీ రాసే స్థితిలో లేడు. ఒకప్పుడు రాశాడా ఇలా? అన్న సంశయం వచ్చేటంతగా శూన్యస్థితికి వచ్చాడు. రాద్దామన్న ఉత్సాహం, ఏమీ యిన్స్పిరేషన్ లేవు. పత్రికలవాళ్ళూ, పబ్లిషర్లూ అడుగుతూనే వున్నారు. అతను మౌనంగా ఊరుకున్నాడు.

పద్మజ పుట్టినరోజు అతనికి జ్ఞాపకం వుంది. ఆరోజు ఆమెకు అందేటట్లు గ్రీటింగ్స్ పంపించాడు, అచ్చు వేయబడిన గులాబీ పువ్వులు. కాని ఆమెకు సకాలంలో అందినట్లులేదు. విశాఖపట్నం ఎడ్రెస్‌కు ఉత్తరం రాసింది. అది బెజవాడకు రీడైరెక్టు చేయబడి వొచ్చింది.'''రాత్రి తొమ్మిది గంటలైంది. వచ్చిన అతిథులందరూ వెళ్ళిపోయారు. కొత్తబట్టలతో, నేను ఒక్కదాన్ని కుర్చీలో వంటరిగా అలిసిపోయిన శరీరంతో మిగిలిపోయాను. ఈ రోజు నీ దగ్గర్నుంచి ఉత్తరం వస్తుందని ఎంతో ఆశించాను. కాని నువ్వెంత కఠినుడివి? బుద్ధ దేవుడికి వారసుడిలా, నాపరాయిలా వుండిపోయావు. నన్ను

వెదుక్కుంటూ వచ్చిందీ నువ్వే. దూరంగాపోయింది నువ్వే. ఎంత స్వార్థం నీకు? నాకు పెళ్ళయినంత మాత్రం చేత నన్ను దూరం చేసుకోవాలని వుందా? ఐతే నన్ను గురించి మరో విధంగా ఆశించావన్నమాట అంతేనా, మరేమీలేదా? ఎంత కోపం వస్తోంది నీ మీద? ప్రపంచానికి అతీతులమై, ఒకరిపట్ల ఆసక్తి లేని ఆకర్షణ. యివన్నీ నీలోలేవన్నమాట. నేను నీ నుంచి ఏమీ కోరలేదు. నువ్వూ అంతేననుకున్నాను. అసలు యిది మీ రక్తంలోనే వుంది..."

మధుబాబు వికల మనస్కుడయాడు. దీనికతను సరియైన సమాధానం యివ్వగలడు. ఒకే కోణం నుంచి ఆలోచిస్తోంది పద్మజ. కాని ఎందుచేతో ఆమె ఎన్నిమాటలన్నా అతనికి కోపం రావటంలేదు. అందుకని సరికిసరి ప్రత్యుత్తరం చెప్పి ఆమె అన్యాయాన్ని ఆమెకు తెలిసేటట్లు చెప్పలేకపోతున్నాడు. తన జీవితంలో ఎటువంటి గండి ఏర్పరిచిందో ముఖాన అనెయ్యలేకుండా వున్నాడు. ఇది తనలోపంగా, తను చేసేవన్నీ అన్యయాలుగా భావిస్తుందేమో పద్మజ. తాను ఆమెని గురించి మరో విధంగా ఆశించాడా? అట్లా ఆశించే పక్షంలో రూపం తెలియని ఆమెను, వందల మైళ్ళదూరంలోవున్న ఆమెనే ఎన్నుకోవాలా? తనకు ఇక్కడ అవకాశాలు లేవా? తనకు చేతకాదా? తను పిరికివాడా? ఎట్లా తెలుస్తుంది యీ సత్యం పద్మజకు? తన సర్వస్వం తెలిసి, తన లోపాలూ, గుణాలూ అన్నీ తెలిసి తనకోఅం ఆరాటపడే జీవులందరు యిక్కడ వుండగా, ఆమె పెట్టే చిత్రవధను సహిస్తూ, చివరకు ఆమెని కలుసుకోవటానికే భయపడి, ఆమె దయమీద ఆధారపడే స్థితికి వచ్చాడే తాను, ఇదంతా అర్థం చేసుకుంటుందా పద్మజ? "నిన్ను అట్లా ఊహించాను, ఇట్లా ఊహించాను" అని ప్రతిసారీ దాన్ని గురించే నొక్కి నొక్కి రాసి, తాను ఆ ఊహించుకున్న రూపాన్నే ఆరాధిస్తున్నానని రాస్తే భరించగలదా పద్మజ? బ్రతగ్గలదా? ఆమె రూపాన్ని గురించి ఆలోచనకు తావియ్యకుండా, యిప్పుడేకాదు, ఎప్పుడూ – చచ్చిపోయేదాకా కూడా ఆమెని ఆరాధిస్తూ వుంటాడని ఆమె ఎలా తెలుసుకుంటుంది?

ఇవన్నీ ఆమెకు చెప్పటం యిష్టంలేదు అతనికి. జవాబు యివ్వకుండా ఊరుకున్నాడు.

అతని నవలకు వచ్చిన బహుమానాన్ని సాహితీ సమితివాళ్ళు హైదరాబాద్‌లో యివ్వటానికి నిర్ణయించి తేదీ, పెద్ద ఎత్తున జరిగే ఆ సభ వివరాలూ తెలియజేశారు. హైదరాబాద్‌లో జరుగుతుందా? అయితే తాను వెళ్ళడు అక్కడికి. వెళ్లలేదు.

తండ్రి వెళ్లమని బలవంతం చేశాడు. అసలు వెళ్ళననటానికి కారణం ఆయనకు బోధపడలేదు. "నాకు వెళ్ళాలని లేదండీ" అని ముభావంగా ఊరుకున్నాడు మధుబాబు. విశ్వనాధంగారు యింకేమీ అనలేక పోయారు. ఫంక్షన్ సరిగ్గా రెండురోజులుండనగా తనకు జ్వరంగా వుందని రాలేకపోతున్నాననీ వైర్ యిచ్చాడు మధుబాబు. తనమీద తనే కసితీర్చుకున్నట్లు అతనికి తృప్తిగా వుంది.

ఒకరోజు తల్లి మళ్ళీ పెళ్ళిమాట ఎత్తింది.

పెళ్ళిగురించి సీరియస్‌గా ఆలోచించే అవసరం మళ్ళీ వచ్చింది మధుబాబుకు. పెళ్ళి అనేది జీవితానికి అందం, సంపూర్ణత్వం, సుఖం యివ్వటానికా? లేక ఓ మామూలా? పెళ్ళి చేసుకోనివాడి జీవితం అస్పష్టంగా, ఓ గురిలేకుండా వుండేమాట వాస్తవమే, కాని చేసుకుని ఈ లక్ష్యం సాధించగలరా? ఈ భూమ్మీద చాలామంది ఆలోచన, లక్ష్యం లేకుండా బ్రతుకుతుంటారు. వయసురాగానే పెళ్ళి చేసుకోవటం, సంసారాన్ని యీదటం, పిల్లల్ని కనటం, అవస్థల పాలవటం – యిదంతా వాళ్ళకు చిత్రమనిపించదు. ఒక విధంగా ఆలోచించటం చేతకాని వాడి జీవితం సుఖపూరితంగా వుండవచ్చు. అది వాడి అదృష్టం. కాని అన్నీ వుండికూడా దురదృష్టవంతులైన వారుంటారు, మధుబాబులాంటి వాళ్ళు. ఇన్ని ఆలోచన్లు, యింత మృదుత్వం అతనికి ప్రసాదించబడటం లోపమే కావచ్చు. కాని దానికి యింత పెద్దశిక్ష? ఎంతోమంది అమ్మాయిల్ని, స్కూళ్ళల్లో, రోడ్లమీద అతను చూస్తూనే వున్నాడు. వీళ్ళలో యెవరూ అతని హృదయాన్ని కదపలేదు. తల్లిపోరుపడలేక కొన్ని సంబంధాలు చూశాడు. పెళ్ళి చూపుల తతంగం అతనికి నవ్వు వచ్చింది. ఏమిటీ పిల్లలు? ఎట్లా వీళ్ళనుంచి ఒకర్ని ఎన్నుకోవటం? అది పెళ్ళి అనబడుతుందా? అసలు లోకంలో యింతకంటే వున్నతమైన వాళ్ళులేరా వీళ్ళని భార్యగా ఊహించటమే కష్టంగా వుంది. తను గొప్పవాడని కాదు. తనని కదిలించే మనిషి అవతలవైపు లేనప్పుడు తన పరిధుల్ని ఎంతకుదించుకున్నా, దానికి తులతూగనప్పుడు ఎట్లా ఒకర్ని తనతో తెచ్చుకోవటం, తన స్నేహితులందరికి వివాహాలు జరుగుతున్నాయి. వాళ్ళలో కొందరికి మంచి భార్యలే దొరికారు. ఇది ఎట్లా సంభవమైంది? వాళ్ళు ఎక్కడినుంచి వచ్చారు. ఒకవేళ పద్మజని దృష్టిలో పెట్టుకుని తాను యిలాంటి విపరీతపు ఊహలు చేస్తున్నాడా? అలాంటివాళ్ళు కోటికి ఒక్కరు కూడా వుండని మాట నిజమే. కాని ఆమె పెనిమిటికి ఎలా ఆమె లభించింది. అతనూ యిట్లా పెళ్ళిచూపులు చూసి పిల్లను యెన్నుకున్నవాడేగా. చక్కా ఓ చిన్న పిల్లను తెచ్చి ఆ పిల్ల బుల్లి బుల్లి పాదాల్తో, పసుపు పారాణితో అటూ ఇటూ యింట్లో చూడాలని తల్లి ముచ్చట, అతనికి నవ్వు వస్తోంది. తాను మానసికంగా యెంత యెదిగాడో, అట్లా వికసించని భావాలుగలపిల్లని, ఈ పరిణతి చెందిన దశలో భరించటం ఎంత కష్టమో ఆమెకు యెట్లా నచ్చచెప్పగలడు?

అసలతనికి పెళ్ళాడాలనిలేదు. అది ఓ మధుర బంధం కాక, వొట్టి నిబంధన అయితే అసలు భరిచంలేదు. తప్పించుకోవటమెలాగు? అన్నీ తిరస్కరిస్తున్నాడు. డాంబికంగా కాదు. నిజంగా నచ్చకే. అబ్బా! పద్మజ తనని యిన్ని బాధలు పడమని యెందుకు శాసించింది.

24

వేసవి సెలవులు గడిపి మధుబాబు మళ్ళీ విశాఖపట్నం వొచ్చేశాడు. ఈ మనుషుల మధ్య గడపటం చాలా దుస్సహంగా వుంది. మనం అనుకున్నట్లు మనల్ని ఏ మాత్రం బ్రతకనివ్వరు యీ మనుష్యులు. వొంటరిగా

వుందామనిపిస్తుంది. యెవడో వస్తాడు, యేదో మాట్లడతాడు. ముభావంగా అర్థం చేసుకోడు యెంతకీపోడు. మనం ఏమీ అనలేం. సభ్యత అడ్డొస్తుంది. ఒక్కోసారి ఏడుపు కూడా వస్తుంది. విసుగు, కోపం భరించలేక.

అసలు సున్నితత్వం మనిషికి యెక్కువగా వుండకూడదు. అడుగడుక్కీ సమస్యలు యెదురౌతుంటాయి. గట్టిగా నవ్వితే భయం, యెక్కువగా మాట్లాడితే భయం, నిద్రలేచినప్పటీనుంచీ మళ్ళీ నిద్రపోయేదాకా అన్నీ యిబ్బందులే. ప్రతిదాని గురించీ సంఘర్షణ, తర్జన, భర్జన, హోటల్‌లో భోజనం చేస్తూంటే ముద్ద నోట్లోకి పోదు. ప్రక్కన తింటున్నవాడు నోటితో అసహ్యంగా చప్పుడు చేస్తుంటే అదో చికాకు. మరి వీటికి అలవాటు పడలేదు, భరించనూలేదు.

అతనికి భోజనం చేశాక తమలపాకులు వేసుకునే  అలవాటుంది. అతని ముఖం చాలా సుకుమారంగా, లేతగా వుంటుంది. నాలిక పెదాలు యిట్టే పండుతాయి. అట్లా వుడటం అతనికి చాలా ఇష్టం. కిళ్ళీకొట్టు వాడితో అతనికి బాగా పరిచయం ఏర్పడింది.

"అట్లా వుంటున్నారేం బాబూ ఈ మధ్య?" అనడిగాడు కిళ్ళీకొట్టు రాగవులు ఓ ఉదయ.

"వంట్లో అంత బాగుండటంలేదు. రాఘవులూ ఓ పని చేసి పెడతావా?"

"చెప్పండి."

"నాకు ఈ గదుల్లో, ఇళ్ళల్లో ఉండాలని లేదు. సౌకర్యంగా కూడా లేదు. హాస్టల్‌లో కూడా వుండలేను. ప్రశాంతంగా వుండాలనిపిస్తోంది. ఎక్కడన్నా మంచి పాక వేసుకుందామనిపిస్తోందోయ్."

"తమరు పాకలో వుంటారా బాబూ?" అని రాఘవులు ఆశ్చర్యపడ్డాడు.

"తప్పేముంది? నాకది చాలా ఇష్టం. తప్పకుండా ఎక్కడన్నా చూడు రాఘవులూ."

కిళ్ళీ దుకాణం వాడు "ఈ పేట తిన్నగా ఇట్లాపోతే ఊరి బయటగా నాకో నాలుగొందల గజాల స్థలం వుంది బాబూ. గజం రూపాయకాడికొస్తే ఆ మధ్య తీసుకున్నాను.లేబరోళ్ళు, ఆళ్ళూ ఆ చుట్టుప్రక్కల వున్నారుగానీ మరీ దగ్గరగా ఏం లేరు. సందడి ఏమీ వుండదు కూడా. అక్కడ పాకేసుకుంటే బాగుంటుంది బాబూ" అన్నాడు కొంచెం ఆగి.

"అయితే ఆ స్థలం ఎప్పుడు చూద్దాం?" అన్నాడు మధుబాబు ఆత్రంగా.

"రేపు ఆదివారం కదు బాబూ! రేప్రొద్దున దుకాణానికొచ్చేముందు మీ రూముకాడికొస్తాను. అక్కడినుండి ఇద్దరం కలిసెల్దాం."

"మరి నీకేమీ అవసరంలేదా స్తలం?"

"అక్కర్లేదు బాబూ. ఎప్పుడన్నా పనికొస్తదని కొన్నాను. ఇప్పుడు నేనుంటున్న ఇల్లు చాలు నాకు."

మరునాడు మధుబాబు అతనితోకూడా వెళ్ళి ఆ ప్రదేశం చూశాడు. చుట్టుప్రక్కల ఎక్కడా ఇళ్ళులేవు. అక్కడక్కడ చెట్లు, దూరంగా కనిపించే కొండలూ, కనిపించీ కనిపించ్నట్లున్న సముద్రం. ఈ ఏకాంత ప్రదేశం" చూసి అతను పరవశుడయ్యాడు.

"తప్పకుండా ఇక్కడే వుంటాను రాఘవులూ" అన్నాడు ఉత్సాహంగా.

"మీ ఇష్టం బాబూ."

Post your comments

*(కొనసాగింపు వచ్చే నెలలో)*